

మొల్ల జయంతిని నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కవయిత్రి, రామాయణ తొలి తెలుగు రచయిత్రి మొల్లమాంబ జయంతిని వచ్చేనెల 13న యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించాలని విసి ఆచార్య జింకా రంగజనార్దనకు మహా కవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కోరారు. గురువారం ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ మొల్ల జన్మించి 700 సంవత్సరాలు అయ్యిందని, జిల్లా వ్యాప్తంగా 7 ప్రదేశాలలో మొల్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్పందించిన విసి తెలుగుశాఖతో సంప్రదించి జయంతిని విశ్వవిద్యాలయం పక్షాన నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విసిని, రిజిస్ట్రార్‌ను శాలువా, మొల్ల జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీ పీఠం మహిళా కార్యదర్శి పార్వతమ్మ, కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ పాల్గొన్నారు.

ఎఎన్ఎం కౌన్సెలింగ్‌లో అయోమయం

- సీనియారిటీ జాబితాలో జూనియర్ల పేర్లు!
- డేట్ ఆఫ్ జాయినింగ్‌కు ఎఎన్ఎంల డిమాండ్
- ఊగిసలాటలో ఆర్‌డి యంత్రాంగం



జిల్లాలో ఎఎన్ఎం కౌన్సెలింగ్‌లో అయోమయం నెలకొంది. సెకెండ్ ఎఎన్ఎం, ఇసిఎఎన్ఎం, కాంట్రాక్టు ఎఎన్ఎం, సచివాలయ ఎఎన్ఎంల కౌన్సెలింగ్‌కు రంగం సిద్ధమైంది. సీనియారిటీ జాబితా ఆధారంగా సెకెండ్ ఎఎన్ఎంల ముందు వరుసలో ఉండాల్సి ఉంది. అనంతరం ఇసి ఎఎన్ఎంలు, సచివాలయ ఎఎన్ం, కాంట్రాక్టు ఎఎన్ఎంలు ఉండాలని తెలుస్తోంది. ఇటీవల నియమితులైన సచివాలయ ఎఎన్ఎం, ఇసి ఎఎన్ఎంల పేర్లు కూడా సీనియారిటీ జాబితాలో ఉండడం గందరగోళానికి కారణమని తెలుస్తోంది. రెగ్యులర్ ఎఎన్ఎంలకు ప్రమోషన్లలో ప్రాధాన్యత ఇస్తే అభ్యంతరం లేదని, సీనియారిటీని విస్మరిస్తే సీనియర్ల పరిస్థితేమిటని సెకెండ్ ఎఎన్ఎంలు వాపోతున్న వైనం విస్మయాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రమైన ఆర్‌డి కార్యాలయ పరిధిలోని 329 మంది ఎఎన్ఎంల కౌన్సెలింగ్ రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌డి కార్యాలయం శుక్రవారం రాత్రి సీనియారిటీ జాబితాను ప్రకటించింది. సీనియారిటీలో జూనియర్లు అయిన సచివాలయ, ఇసిఎఎన్ఎంల పేర్లు ఉండడం ఆందోళనకు కారణమని తెలుస్తోంది. 2007లో సెకెండ్ ఎఎన్ఎంలు, 2009లో ఇసిఎ ఎన్ఎంలు, 2019లో సచివాయల ఎఎన్ఎంలు, కాంట్రాక్టు ఎఎన్ఎంలను ఆయా ప్రభుత్వాల ప్రాధాన్యాత ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేసినట్లు తెలుస్తోంది. కౌన్సెలింగ్‌ల్లో ఎఎన్ఎంలకు సీనియారిటీ ఆధారంగా బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఆర్‌డి కార్యాలయం శుక్రవారం సెకెండ్ ఎఎన్ఎం, ఇసిఎఎన్ఎం, సచివాలయ ఎఎన్ఎం, కాంట్రాక్టు ఎఎన్ఎం కేటగిరీల్లోని 329 మంది ఎఎన్ఎంల సీనియారిటీ ఆధారంగా జాబితాను విడుదల చేసింది. 83 మంది రెగ్యులర్ ఎఎన్ఎంలు సీనియారిటీ జాబితాకు అర్హులని తెలుస్తోంది. మిగిలిన సచివాలయ ఎఎన్ఎమ్‌లు, ఇసి ఎఎన్ఎంలకు డేట్ ఆఫ్ జాయినింగ్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండడం ప్రకృతి సహజన్యాయ సూత్రాల ఆధారంగా సమంజసమనే డిమాండ్ వినిపిస్తోంది. ఇందుకు అనుగుణంగానే 2022 డిసెంబర్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లోనూ సీనియారిటీ ఆధారంగానే కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతిని సెకెండ్ ఎఎన్ఎంలు గుర్తు చేస్తుండడం గమనార్హం. సీనియారిటీ జాబితాలో సెకెండ్ ఎఎన్ఎంల స్థానంలో ఇసి ఎఎన్ఎంల పేర్లు చోటు చేసుకోవడంలో మతలబేమిటో ఆర్‌డి కార్యాలయం చెప్పాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇందులో ఓ సీనియర్ అసిస్టెంట్ మొత్తం వ్యవహారాన్ని నడిపించడమే కారణమనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు రాష్ట్రంలోని నాలుగు జోన్లలో ఎక్కడాలేని విధంగా జోన్-4లోని కౌన్సెలింగులు వివాదాస్పదంగా మారుతుండడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎఎన్ఎంల సీనియారిటీ సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. శుక్రవారం నాటి కౌన్సిలింగ్ సమయానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందితేసరి, అందని పక్షంలో యథాతథం గానే కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.

- డాక్టర్ కోటేశ్వరి, వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డి, కడప.

ప్రణాళికా బద్ధంగా రీసర్వే

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప


మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వే పనులను జిల్లాలో ప్రణాళికా బద్ధంగా సాగుతోందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుండి రాష్ట్ర భూ పరిపాలనా శాఖ కమిషనర్ సాయిప్రసాద సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి 'జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష' పథకం కార్యాచరణ, అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా సిసిఎల్‌ఎ కమిషనర్ మాట్లాడుతూ రీసర్వే చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టోన్స్ ప్లాంటేషన్ కూడా పూర్తి చేసేలా చూడాలన్నారు. త్వరితగతిన రీ సర్వేలో అన్ని రకాల ప్రక్రియలను పూర్తిచేయాలన్నారు. ప్రధానంగా రీసర్వేపై జిల్లా కలెక్టర్లు, జెసిలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన తెలిపారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే ఈ రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. విసి ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు రీసర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియను పూర్తి చేయగలిగామని చెప్పారు. జిల్లాలో భూముల స్వచ్ఛీకరణ ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా ఎప్పటికప్పుడూ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి ఎస్‌డిసి శాంతమ్మ, ల్యాండ్ సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదు

- కలెక్టరేట్ వద్ద ఎపిడబ్ల్యూజెఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు, జర్నలిస్టులు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై డాక్యుమెంటరీ విడుదల చేసిన బిబిసిపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఐటి దాడులు చేయించడం శోచనీయమని, మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) నాయకులు అన్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద మీడియా ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2002లో గుజరాత్ మత మారణహోమంలో నాటి గుజరాత్ ముఖ్యమంత్రి, నేటి ప్రధాని నరేంద్ర మోడీ పాత్రను బయట పెట్టినందుకు బిబిసి వార్తా ఛానల్ పై కేంద్రం వేధింపులకు దిగిందన్నారు. ఈ చర్యను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఢిల్లీలోని బిబిసి కార్యాలయాలపై ఆదాయపు పన్ను అధికారులు సెర్చ్, సర్వే పేరుతో దాడులకు దిగడం పత్రికా స్వేచ్ఛపై పరోక్ష కక్ష సాధింపుకు పాల్పడ డమేనన్నారు. ప్రధాని మోడీ నిజ స్వరూపాన్ని బయటపెట్టినందుకు ఇప్పటికే బిబిసి డాక్యుమెంటు లింకులను సామాజిక మాధ్యమాల్లో పెట్టడాన్ని నిషేధించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు నేరుగా ఆ వార్తా ఛానల్ పైనే దాడులకు దిగిందన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్న నరేంద్ర మోడీ చర్యలను అందరూ ఖండించాలని వారు పిలుపునిచ్చారు. మీడియా స్వేచ్ఛను హరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని, హక్కులను హరించాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఎఒ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో మీడియా ప్రతినిధులు కాటిబోయిన నారాయణ, చంద్రమోహన్‌రాజు, చౌడం సూరిబాబు, మన్నూరు నూరుబాషా, ముద్దా సిద్దయ్య, సి.ఎస్.ప్రసాద్, నల్లి బాలకృష్ణ, టేకూరి సుదర్శన్, దూళిపాటి రాఘవులు, కొనేజయ దుర్గాప్రసాద్, జంబారపు రవికుమార్, బ్రహ్మానందరాజు, చౌడం నాగార్జున, టక్కోలి ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్మగ్లర్ అరెస్టు

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపామని అందులో భాగంగా అంతర్జాతీయ స్మగ్లర్ ఇరగంరెడ్డి దస్తగిరి రెడ్డి (32)ని అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మగ్లర్ నుంచి 603 కేజీల బరువున్న 20 ఎర్రచందనం దుంగలు, 2 కార్లు, రెండు సెల్ ఫోన్స్, వైఫై రూటర్, ఏటీఎం కార్డు, రూ. 2,500 నగదు, రెండు గొడ్డళ్లు, రెండు కట్టెలు, మూడు పట్టుడు రాళ్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఇంటి దొంగతనాలలో మోస్ట్ వాంటెడ్ ఇరగం రెడ్డి దస్తగిరిరెడ్డి ఉన్నాడని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో అతనిపై సుమారు 36 ఇంటి దొంగతనం కేసులు నమోదయ్యాయని చెప్పారు. 86 ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు, 2 పీడీ యాక్టులున్నాయని వివరించారు. అతని స్వగ్రామం దువ్వూరు మండలమని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దస్తగిరిరెడ్డి పేరు మోసిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లు సింపతి లాల్‌బాషా, ఫకృద్దీన్‌లతో కలిసి ముఠాగా ఏర్పడి కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎర్రచందనం చెట్లను నరికించి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. బడాస్మగ్లర్‌ను అరెస్టు చేసిన ఒంటిమిట్ట సిఐ పురుషోత్తమరాజు, రెడ్ శాండర్స్ టాస్క్‌ఫోర్సు సిఐ నాగభూషణం, సిద్దవటం ఎస్‌ఐ తులసి నాగప్రసాద్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్‌ఐ అభినందించారు. వారికి నగదు రివార్డు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

18న ప్రత్యేక లోక్ అదాలత్

కడప : మార్చి 18న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి సి. ఎస్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత తెలిపారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించే అదాలత్‌లో కుటుంబ తగదాలకు సంబంధించిన కేసులు, వినియోగదారులు, ఐపిఆర్‌కు సంబంధించిన కేసులను మాత్రమే రాజీ చేసు కోవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం 08562 258622, 244622లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధం

కడప : ఎలాంటి విపత్కర ప్రమాదాలనైనా తక్షణమే ఛేదించేందుకు జిల్లా విపత్తుల నిర్వహణ, ఫైర్ సిబ్బంది అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎల్లవేళలా అప్రమత్తంగా ఉన్నామని ఆర్‌డిఒ పి.ధర్మ చంద్రారెడ్డి, నగర కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్ చంద్ సంయుక్తంగా పేర్కొన్నారు. సిబిఆర్‌ఎన్. మాక్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కడప నగర శివార్లలోని ఐఒసిఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బాటిలింగ్ ప్లాంటు ఆవరణలో జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ట్యాంకర్లకు గ్యాస్ ఫిల్లింగ్ సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించే సమయంలో ఎలాంటి సహాయక, పునరావాస చర్యలు తీసుకోవాలో ప్రత్యక్షంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, జిల్లా చీఫ్ ఫైర్ అధికారి బి.వి.ఎస్. రాంప్రకాశ్, ఎఎస్‌పి కృష్ణారావు, వైద్య, హెచ్ పిసిఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

విసిలను వెంటనే రీకాల్ చేయాలి

కడప అర్బన్ : నియంతృత్వ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ విసి రామకృష్ణ రెడ్డి, ఆంధ్ర యూనివర్సిటీ విసి ప్రసాద్ రెడ్డిని రాష్ట్ర గవర్నర్ వెంటనే రీకాల్ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, జిల్లా కార్యదర్శి ఓ.నాగేంద్రబాబులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో పిడియస్ యు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజుల కిందట విసిలు మృత్యుంజయ హోమాలంటూ యూనివర్శిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి సర్క్యుల్ పంపి డబ్బులు వసూలు చేశారని చెప్పారు. నూతన గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇవన్నీ పరిశీలించి విసిలను రికాల్ చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు నగర నాయకుడు నవీన్ పాల్గొన్నారు.

రాయల్ రషీద్ సేవలు అమోఘం

కడప అర్బన్ : 1971 నుంచి 1995 వరకు కడప జిల్లాలో మీడియా రంగానికి ఉచితంగా ఫొటోలు అందించిన ఫొటో జర్నలిస్టు షేక్ అబ్దుల్ రాయల్ రషీద్ చేసిన సేవలు అమోఘమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మృతుని కుటుంబ సభ్యులను కలిశారు. తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. సమాచార శాఖ అధికారులు కూడా తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాయల్ రషీద్ తనయులు తండ్రి అడుగు జాడల్లో నడవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాని పోలుదాసు కృష్ణమూర్తి, సంఘ సేవకులు సలావుద్దీన్, టిడిపి రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు జిలాని భాష, సయ్యద్ మొహమ్మద్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు రెండు నామినేషన్లు

ప్రజాశక్తి - కడప

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. చివరి రోజు అయిన గురువారం రెండు నామినేషన్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండం గాదెల గ్రామానికి చెందిన నాయుడోరి రమణయ్య నామినేషన్ దాఖలు చేశారు. జెసి, రిటర్నింగ్ అధికారి సాయికాంత్ వర్మకు నామినేషన్ ఇచ్చారు. వైసిపి తరుపున పి. రామసుబ్బారెడ్డి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 24 నుంచి నామినేషన్లను పరిశీలించనున్నారు. ఉపసంహరణకు ఈనెల 27న చివరి గడువు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్


మాట్లాడుతన్న పిఒ ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఎస్‌ఎ పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగర ంలోని మున్సిపల్ ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో సమావేశమయ్యారు. పరీక్షల ఫోబియా పోగొట్టే దిశగా విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థీ లక్ష్యం పెట్టుకోవాలని, అందు కోసం ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలే గాక సమాజం గురించి చదవాలని తెలిపారు. నిజ జీవితంలో రాణించాలంటే మార్కులు గ్రేడ్ లే ప్రామాణికం కాదని ఆసక్తి, సాధన కృషి, తపన ఉంటే సాధించలేనిది ఏది లేదని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారు ఉత్తీర్ణత అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు , మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ, సెక్టరియల్ అధికారి దశరథ రామిరెడ్డి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఇలియాస్, ఆర్ట్ టీచర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న లక్ష్మీరాజ

కడప అర్బన్ : సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 11 నెలల నుంచి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రభుత్వ వాటా కాంట్రిబ్యూషన్ మినహాయిస్తూ దానిని ఎన్‌ఎస్‌డిఎల్ లో జమ చేయకుండా మొండి బకాయిలుగా మార్చిందని విమర్శించారు. దీనివల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు లభించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చేకూరడం లేదని తెలిపారు. డిఎ బకాయిలు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని చెప్పి కూడా నేటికీ సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకపోగా సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను సవతి తల్లి పిల్లలుగా చూస్తోందని చెప్పారు. ఇది మంచి పద్ధతి కాదని వెంటనే సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ సొమ్ము వారి ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సొమ్ములను వాడుకొని తింటున్న ప్రభుత్వం రేపు జిపిఎస్ అనే కొత్త పథకాన్ని తీసుకవస్తే ఇక ఉద్యోగులకు మొండి చేయి చూపిస్తుందని తెలిపారు. ముఖ్య మంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేసే పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని అందుకు భవిష్యత్తులో మరింత తీవ్రతరమైన ఉద్య మాలకు నాంది పలుకుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దావుద్దీన్, సిపిఎస్ జిల్లా కో- కన్వీనర్లు కరిముల్లా, కిరణ్ కుమార్, వీరనారాయణ పాల్గొన్నారు.


ప్రజారక్షణే పోలీసు ప్రధాన లక్ష్యం

కడప అర్బన్ : ప్రజారక్షణే లక్ష్యమని, శాంతిభద్రతల పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమని ఎస్ఐ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో గురువారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందుతున్న యువతకు హెరాయిన్, గంజాయి, పాన్‌పరాగ్, గుట్కా, పొగాకు వంటి ప్రాణాంతకమైన మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితంలో ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందో తెలిపారు. అటువంటి వాటిని పెంచడం కాని, ప్రోత్సహించడం కాని, అమ్మటం కాని చట్టరీత్యా నేరమని చెప్పారు. రాష్ డ్రైవింగ్ చేయొద్దని, ఎదుటి వ్యక్తులకు ఇబ్బంది కలిగించరాదని పేర్కొన్నారు. జీవితాన్ని బాధ్యతగా మలుచుకోవాలని యువతకి మార్గ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు వాసవి, నాగ సురేఖ, రామ భవాని, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు సుబ్బరామిరెడ్డి, అజీమ్, జిలాన్, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సరికొత్త పరిష్కార మార్గాలు అన్వేషించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సరికొత్త ఆలోచనలు చేస్తూ పరిష్కార మార్గాలు చూపేవారే ప్రపంచంలో ముందు వరుసలో నిలుస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్ధన్ ఉద్బోధించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సర్.సి. వి రామన్ సెమినార్ హాల్‌లో జాతీయ సేవా పథకం సెల్, కౌన్సెలింగ్ గైడెన్స్ సెల్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 సంయుక్త ఆధ్వర్యంలో ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులకు గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఎక్కడి నుంచి వచ్చాం, కుటుంబ నేపథ్యం ఏమిటి అనే ఆలోచనలు విడనాడి, ఏదైనా సాధించాలనే లక్ష్యంతో సాధన చేసి గమ్యం చేరుకోవాలన్నారు. విషయ పరిజ్ఞానంతోపాటు ఇంటర్వ్యూ బోర్డులో ప్రదర్శించాల్సిన నైపుణ్యాలకు సంబంధించిన అవగాహన అవసరమన్నారు. సంభాషణలు, ఉపన్యాసాల్లో విషయం, హావభావాలు, శ్రోతల స్పందనను దృష్టిలో ఉంచుకొని మాట్లాడాలన్నారు. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మేధోపరమైన ఆలోచనలు జీవిత ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెసిఐ ఇంటర్నేషనల్ ట్రైనర్ కె. కృష్ణ భాస్కర్, జెసిఐ ట్రైనర్ డాక్టర్ నూరిపారి, డాక్టర్ కే లలిత, డాక్టర్ పి సరిత, మనో విజ్ఞాన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజర్ వైస్ ప్రిన్సిపల్ టి. శ్రీనివాస్, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ ఎస్.వి. సుబ్బారెడ్డి, ప్రధాన ఆచార్యుల కార్యా లయ సమన్వయకర్త డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ సునీత, డా.రవీంద్ర, డాక్టర్ లక్ష్మీ నరసింహ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల

విద్యార్థినులకు క్రికెట్‌లో శిక్షణ

ప్రజాశక్తి - కడప

జిల్లా మహిళల క్రికెట్ అభివృద్ధిలో భాగంగా గురువారం ఐటిఐ సర్కిల్ వద్దగల వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినులకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఫీషియల్ సభ్యులు కె. విష్ణు మోహన్ రావు, ఉమెన్ కో-ఆర్డినేటర్ పద్మావతి, వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో క్రికెట్‌లో శిక్షణ ఇచ్చారు. క్రికెట్ శిక్షణకు హాజరైన విద్యార్థినులకు ఎసిఎ క్రికెట్ అకాడమీ సౌత్ జోన్ కన్వీనర్ పి. సంజయ్ కుమార్ రెడ్డి, డిసిఎ ఎస్ కాజా మైనుద్దీన్, క్రికెటర్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, సభ్యులు రెహమాన్, విష్ణు మోహన్ రావు క్రికెట్లోని మెలకువలను తెలియజేశారు. మహిళా క్రికెట్‌లో ఆసక్తిగల వారికి తగు శిక్షణ ఇచ్చి మంచి క్రికెటర్లుగా తీర్చిదిద్దామని ఈ సందర్భంగా వారు చెప్పారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులు చేపడుతున్న సిబ్బంది

చెన్నూరు : చెన్నూరు కొత్తరోడ్డు నుంచి వనం వీధి వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రెయి నేజీ, తాగునీటి పైప్‌లైన్, సిమెంట్ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. రెండు నెలల కిందట ఎంఎల్‌ఎ రవీంద్రనాథరెడ్డి పనులకు సంబంధించి భూమి పూజ చేశారు. అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతున్న ఎట్టకేలకు గురువారం ప్రారంభించారు. జెసిబితో మట్టిని తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి మార్కింగ్ వేశారు. త్వరగా పనులు పూర్తిగా అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, వైసిపి నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ పెద్ద పి.టి. జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు బాలురు మృతి

ప్రజాశక్తి-చెన్నూరు


మృతి చెందిన బాలురు శశాంక్, మనోజ్

చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాదర్‌ఖాన్‌కొటాల్ గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో ఇద్దరు బాలురు మృతిచెందారు. ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డి వివరాల మేరకు.. ఖాదర్‌ఖాన్ కొటాలకు చెందిన శశాంక్ (12), మనోజ్ (4) ఉదయం 10.30 గంటలకు తమ ఇంటి పైకప్పు ఎక్కి ఆడుకుంటున్నారు. ఇంటి మిద్దెపైన సమీపంలో విద్యుత్ మెయిన్‌లైన్ తీగలను పొరపాటున పట్టుకుని విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. అపస్మాకర స్థితిలోకి వెళ్లిన చిన్నారులను స్థానికులు గుర్తించి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. డిఎస్‌పి వెంకటశివారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. **పోరుమామిళ్లలో వివాహిత..** మండలంలోని దమ్మనపల్లె గ్రామానికి చెందిన సుమలత(28)అనే వివాహిత విద్యుదాఘాతంతో మృతిచెందారు. నీటిని వేడి చేసేందుకు హీటర్‌పెడుతున్న నేపథ్యంలో చేతికి తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం వారి పిల్లలను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైసిపి అనుబంధ విభాగాల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప

వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామ కాలు గురువారం చేపట్టారు. వివరాలను పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలియజేశారు. యూత్ విభాగం జిల్లా అధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులుగా లింగాల ఉషారాణి, రైతు విభాగం జిల్లా అధ్యక్షులుగా పి.ప్రసాద్ , బిసి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా బంగారు నాగయ్య, ఎస్‌సి సెల్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా సి. వినోద్ కుమార్ , ఎస్‌టి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా ఎల్. వేణుగోపాల్ నాయక్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులుగా సాయిదత్త, సేవాదళ్ విభాగం జిల్లా అధ్యక్షులుగా సమరనాథరెడ్డి నియమితులయ్యారు. పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షులుగా నాగేంద్రరెడ్డి, పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులుగా కల్లూరు నాగేంద్ర, క్రిస్టియన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులుగా సంపత్, గ్రీవిన్స్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా మల్లికార్జున, ఐటి వింగ్ జిల్లా అధ్యక్షులుగా కల్లా నిత్య ఈశ్వర్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులుగా కరుణాకర్, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా పుల్లా రెడ్డి , చేనేత విభాగం జిల్లా అధ్యక్షులుగా వెంకట లక్ష్మీదేవి , వైఎస్సార్ టియుసి అధ్యక్షులుగా మల్లూరి జాషువా, వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులుగా షేక్ అహ్మద్ బాషా, డాక్టర్ శివా నాయక్ నియమింపబడ్డారు. **సురేష్ బాబుకు సన్మానం..** నూతనంగా వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమితులైన వారు గురువారం వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

విభిన్న ప్రతిభావంతులకు పండ్లు పంపిణీ


కడప అర్బన్ : పాత రిమ్సుని అల్ సిఫా కేంద్రంలో తోపుడుబండ్ల వ్యాపారస్తులు రాము, మగ్బూల్, పెద్ద రాము, మస్తాన్ కలిసి విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ద్రాక్ష, ఆపిల్, జామకాయలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నాయకులు ఆర్.బాబు, నాగిరెడ్డి, సుబ్బరాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.బాబు మాట్లాడుతూ వ్యాపారులు దివ్యాంగులు సేవ చేయడం హర్షణీయమన్నారు. రాబోయే రోజుల్లో పండ్ల వ్యాపారస్తులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అల్‌షిఫా వ్యవస్థాపకులు ఎస్. మహమ్మద్ రఫీ మాట్లాడుతూ పండ్ల వ్యాపారులకు మానసిక వికలాంగుల పిల్లల పట్ల అవగాహన కలిగించి తమ కేంద్రానికి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న తోపుడు బండ్ల నిర్వాహకులు

ఐసిటిసి పనితీరుపై ప్రశంసలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు వైద్య విధాన పరిషత్‌లోని ఐసిటిసిని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఐసిటిసి కేంద్రంలోని రికార్డులను, రిజిస్టర్లు ల్యాబ్‌లను పరిశీలించారు. కౌన్సిలర్ వి.ప్రతాప్‌కుమార్ ఐసిటీసి కేంద్రం నిర్వహణపై అనుసరిస్తున్న విధానాలను అభినం దించారు. లింకి ఎఆర్‌టి నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రొగ్రాం మేనేజర్ వి.భాస్కర్ మాట్లాడుతూ జమ్మలమడుగులోని ఐసిటిసి కేంద్రం, ల్యాబ్ సేవలు, రక్తనిధి కేంద్రం, క్షయవ్యాధి సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ఐసిటిసి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ పాషా మాట్లాడుతూ గతంలో పోలిస్తే రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు చాలా వరకు తగ్గారన్నారు. ఐసిటిసి కౌన్సిలర్ వి.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రక్తనిధి కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ నెల్సన్, ల్యాబ్ టెక్నీషియం కిరణ్, నందకిషోర్, సునీల, భారతి పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న వి.భాస్కర్

సిఎం దంపతులనూ విచారించాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి దంపతులను కూడా సిబిఐ విచారించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిబిఐ విచారణ కావాలని అడిగి, ముఖ్యమంత్రి అయ్యాక సిబిఐ విచారణ ఎందుకు వద్దన్నారని ప్రశ్నించారు. ఐదవ ముద్దాయిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని వైసిపి నుండి ఎందుకు సస్పెండ్ చేయలేదని విమర్శించారు. మొదటి ముద్దాయిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డిపై రాష్ట్ర పోలీసులు సకాలంలో ఎందుకు ఛార్జీషీట్ వేయలేదని ప్రశ్నించారు. సిఐ శంకరయ్య వాగ్మూలం ఇచ్చేదానికి సిద్ధపడి వెనక్కి తగ్గిన తర్వాత ఆయన సస్పెన్షన్ రద్దు చేసి ప్రమోషన్ ఎందుకు ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు లేకుండా రాష్ట్ర పోలీసులు సిబిఐ అధికారిపై కేసు పెట్టగలరా అన్నారు. ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత కేసులను, ప్రభుత్వ కేసులను, వివేకానందరెడ్డి హత్య కేసులో ముద్దాయిల తరుపున నిరంజన్‌రెడ్డి అనే ఒకే లాయర్ వాదించడం వాస్తవం కాదా అన్నారు. అవినాష్‌రెడ్డి జగన్, భారతితో మాట్లాడినట్లు కాల్ డేటా ద్వారా తెలుస్తోందన్నారు. అన్ని దారులు రోమ్ నగరం వైపు ఉన్నట్లు విషయాలు అన్ని సిఎం జగన్ వైపు చూపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

26న తవ్వా వెంకటయ్యకు అభినందన సభ

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 26న ఖాజీపేట మండలం తవ్వారిపల్లె వాసి యువరచయిత, సాహిత్య పరిశోధకుడు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు బొమ్మిశెట్టి మోహన్, రమేష్, మురళి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని సాయిభగవాన్ కళ్యాణమండపంలో సభను ఏర్పాటు చేశామన్నారు. మైదుకూరు ఫ్రెండ్స్ వాట్సప్ గ్రూపు సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ ఆకుల దర్బార్ సుబ్రహ్మణ్యం, గవిరెడ్డి రవిశంకర్‌రెడ్డి, చొక్కం రమణయ్య, తిప్పిరెడ్డి జయనరసింహారెడ్డి, వేణు గుప్తా, రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ తవ్వా వెంకటయ్య ఇటీవల ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులుగా ఎన్నికైన విషయం విదితమే. సాహితీవేత్తలు, రచయితలు, చరిత్ర పరిశోధకులు, కవులు, ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొమ్మిశెట్టి బ్రదర్స్ కోరారు.

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆరవ వార్డులోని చౌడమ్మ దేవాలయం వద్ద నుంచి సంజాములమోటు వరకు గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలన, తుగ్లక్ పాలనకు దగ్గరగా ఉంద న్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి నిరంకుశంగా వ్యవహరిస్తున్న తీరు మన ముఖ్యమంత్రిలోనే చూస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలంటే 2024లో టిడిపి అధికారంలోకి రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. అంతకుముందు భూపేష్‌రెడ్డికి మెగా ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. బైక్ మీద చౌడమ్మ దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కిట్టు, మునిరెడ్డి, తులసిరెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, భూసిరెడ్డి, సర్దార్, రఫీ, వెల్డింగ్ గైబు, జయచంద్ర, నాగలకట్ట కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ఘనంగా వైఎస్.భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైయస్ భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, బ్రాహ్మణపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. వీటిని పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైయస్ మనోహర్‌రెడ్డి, ఎపి పౌరసరఫరాల డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న చైర్మన్, వైసిపి నాయకులు

లింగాల : మండల కేంద్రమైన లింగాలలో గురువారం పులివెందుల వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ భాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడలయ్య స్వామి ఆలయం వద్ద కడప పార్లమెంటరీ సెక్రెటరీ సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 కిలోల కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆలయం పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, నాయకులు భూషణ్‌రెడ్డి, బాబురెడ్డి, కుమార్‌రెడ్డి, లింగాల సర్పంచు అనిల్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు సిఎం పెద్దపీట

- మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సిఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారని పురపాలక సంఘం చైర్మన్ వల్లపు వరప్రసాద్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో బడుగు, బలహీన వర్గాల కోసం జ్యోతిరావు పూలే పోరాడారని తెలిపారు. నేడు వారికోసం పోరాడుతున్న మరో జ్యోతిరావు పూలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాలు ప్రకటిస్తే అందులో 11 స్థానాలను బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించారన్నారు. నూర్‌బాషా సంఘం నాయకుడు రఫీ మాట్లాడుతూ బిసిలకు జగన్మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ నెంబర్ చంద్రమౌళి, బిసి జిల్లా కార్యదర్శి రాజేష్ నాయుడు, తాలూకా కార్యదర్శి దువ్వూరు సంపత్, నాయిబ్రాహ్మణ కార్యదర్శి కొండయ్య పాల్గొన్నారు.

దుమ్ము.. వాహనదారులకు ముప్పు

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప-కర్నూలు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకోవడం ఒక ఎత్తయితే, జాతీయ రహదారి నిర్వహణ తీరు సక్రమంగా లేకపోవడం మరో ఎత్త. ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని ఆంజనేయపురం సమీపంలో పెన్నా నది వంతెన నుంచి పెద్ద ఎత్తున టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. టిప్పర్ల రాకపోకల వల్ల పెద్ద ఎత్తున దుమ్ము చెలరేగుతోంది. వాహనాల రాకపోకల వల్ల వచ్చే దుమ్ము జాతీయ రహదారి పైకి వచ్చి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుమ్ము లేసే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదని వాపోతున్నారు. అంతేకాక దుమ్ము కళ్లల్లో పడుతోందని అంటున్నారు. టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. టిప్పర్ల ద్వారా ఇసుక సరఫరా సమయంలో పట్టలు కప్పకుండా వెళుతున్నారు. దీంతో ఈ సమస్య ఎదురవుతోంది. జాతీయ రహదారి విభాగాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


జాతీయ రహదారిపై ఉన్న ఇసుక, దుమ్ము

రూ.10.45 లక్షల రికవరీకి ఆదేశాలు


మాట్లాడుతున్న డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలో జరిగిన రూ.8.19కోట్ల ఉపాధి హామీ పనులపై గురువారం స్త్రీ శక్తి భవన్‌లో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధి పీడీ యదుభూషణ్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామాల వారీగా సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల ద్వారా రూ.4.68కోట్లు, మెటీరియల్ ద్వారా రూ.3.51కోట్లు ఖర్చు చేశారన్నారు. ఈ పనులకుగానూ పంచాయతీ రాజ్ ఉపాధి అనుసంధానంతో చేసిన పనుల్లో పెద్ద గురువలూరు-రామసుబ్బమ్మ కొట్టాలు మధ్య ఏర్పాటు చేసిన రోడ్డులో రూ.8.94 లక్షలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ సభ్యులు గుర్తించారన్నారు. వివిధ గ్రామాల్లో పంచాయతీరాజ్ పనుల్లో రూ.94వేలు, ఉపాధి హామీ కూలీల ద్వారా రూ.6,519 అవినీతి జరిగినట్లు గుర్తించామన్నారు. వీటితోపాటు 600 బస్తాల సిమెంటు పనులకు వినియోగించకపోవడంతో గడ్డకట్టి చెడిపోయినట్లు గుర్తించామన్నారు. సామాజిక తనిఖీలు గుర్తించిన మొత్తాన్ని రికవరీకి ఆదేశించామన్నారు. మండల పరిధిలో ఉపాధి కూలీల సంఖ్య తక్కువగా ఉందని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కుందూ నదిలో ఉపాధి పనులు చేపట్టరాదన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించాలన్నారు. అమృత్ సరోవర్ కింద చెరువులు, కుంటలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కూలీలకు పనులు చూపాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న 659 మంది ఆధార్ సీడింగ్ వెంటనే చేపట్టాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఇ యోగాంజనేయరెడ్డి, ఎంపిపి లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, పంచాయతీరాజ్ ఎఇ ఈశ్వరయ్య, హౌసింగ్ ఎఇ మహబూబ్ బాషా, ఎపిడి శ్రీలక్ష్మి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఇఇ విజయభాస్కర్, జెఇఇ సుధాకర్, ఎపిఒ పద్మారాణి, ఇసి ప్రియాంక, సామాజిక తనిఖీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారికి నోటీసులు

జగనన్న కాలనీలలో ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలాన్ని పొంది నిర్మాణాలు ప్రారంభించని వారిని గుర్తించి, నోటీసులు జారీ చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఉపాధి పీడీ యదుభూషణ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తిభవన్‌లో గురువారం మండలస్థాయి అధికారులు, ఎంపిపితో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 587 మందికి జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు మంజూరు చేయగా, 178గృహాలు ప్రారంభించారన్నారు. నియోజకవర్గ పరిధిలో చాపాడు మండలం ఇళ్ల నిర్మాణాలు కొనసాగించడంలో ముందంజలో ఉందన్నారు. మదూరు, సోమాపురం, మొర్రాయపల్లి గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మాణాల్లో వెనకడుగు వేస్తున్నారని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, హౌసింగ్ ఎఇ మహబూబ్ బాషా తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, అందుకు సహకరించాలని ఎంపిపి లక్ష్మయ్యను కోరారు. లబ్ధిదారులకు ఇందిరా క్రాంతి పథకం నుండి రూ.35వేలు రుణాలు మంజూరు చేయాలన్నారు. తహశీల్దార్ సుభాని, వెలుగు ఎంపిఎం వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను ఆదరించండి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎంను ఆదరించాలని ఆ పార్టీ జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ కోరారు. ప్రజా ఉద్యమ విరాళాలను గురువారం ఆయన ప్రజల వద్దకెళ్లి సేకరించారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ దేశంలో పెట్రేగిపోతున్న మత తత్వానికి వ్యతిరేకంగా సిపిఎం దేశ సమైక్యతకు కట్టుబడి పోరాడుతుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు అంబానీ, అదానీలకు దొచిపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం నినదిస్తున్నమన్నారు. ఇలాంటి తరుణంలో ప్రజా ఉద్యమాలను ప్రజలు ఆదరించి బలపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఎంకు విరాళాలు ఇచ్చి ఉద్యమాలకు ఊపిరి పోయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, సిపిఎం నాయకులు సంజీవరాయుడు, శ్రీను, గోపి, రాజేష్, కృష్ణ పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

నిబంధనల మేరకు కొనుగోలు చేయాలి


శనగ రైతులతో మాట్లాడుతున్న తిరుపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి శనగలను కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి సూచించారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శనగ పంట రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల మేలుకోరి మద్దతు ధరగా రూ.5335గా నిర్ణయించిందన్నారు. దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ రత్నరాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ముద్దనూరు : ప్రభు త్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చి రైతుల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తోందని మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి తెలిపారు. మండలంలోని రాజులగురువాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆయన శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిరాజారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చి రైతులకు పెద్ద పీట వేశారన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.5,335 శనగలను కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హరినారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జులైకి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని గురువారం అనంతపురం జిల్లా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జులై ఆఖరికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ఇస్తామన్నారు. అనంతరం గుత్తేదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఏవైనా మెటీరియల్ తక్కువ వస్తే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. మున్సిపల్ చైర్మన్‌తో మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు బేల్దారులను సమకూర్చేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఖాదర్, సిద్దయ్య, దాసరి చంద్రమౌళి పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్

పౌష్టికాహారం తప్పక తీసుకోవాలి

పులివెందుల రూరల్ : గర్భిణులు రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని నీతి అయోగ్ పరమల్ పేరడేషన్ పరిశీలకులు వెంకటేష్ తెలిపారు. స్థానిక మంగళ కాలనీ అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమ ణమ్మ, మాబున్ని, అంగన్వాడీ కార్యకర్త మల్లేశ్వరి, అరుణ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ సమాచారం ఇవ్వడంలో జాప్యం..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయంలో పలు రకాల ఆర్‌టిఐ సమాచారం ఇవ్వడంలో జాప్యం జరుగుతోందనే ఆరోపణలున్నాయి. మొన్నటి వరకు ఆర్‌టిఐకు సంబంధించిన దరఖాస్తు మున్సిపల్ కార్యాలయంలో ఎవరికి ఇవ్వాలో కూడా తెలియని పరిస్థితిలో ప్రజలు ఉండేవారు. ఆ మేరకు 'ప్రజాశక్తి' దినపత్రికలో 'కనిపించని పౌర సమాచార బోర్డు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సమాచార బోర్డును ఏర్పాటు చేశారు. అయినా సమాచారం కోసం వస్తున్న పౌరులకు మాత్రం నిరాశే ఎదురవుతోందనే విమర్శలున్నాయి. సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం ఏ వ్యక్తి అయినా, ఏ కార్యాలయంలో అయినా సమాచారం కోసం దరఖాస్తు చేస్తే ఆ వ్యక్తికి 30 రోజులుపైబడకుండా సమాచారం అందించాలనేది నిబంధన. కానీ మున్సిపల్ కార్యాలయంలో మాత్రం అధికారులు ఈ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందులో ఉన్న మతలబమిటోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ రోజులు గడిపేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



నగర పంచాయతీ కార్యాలయం

ట్యాప్ అకాడమీకి సిబిఐటి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక సిబిఐటి కళాశాలకు చెందిన చివరి సంవత్సరం విద్యార్థులకు గురువారం ట్యాప్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాత పరీక్షల్లో 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 23 మంది కమ్యూనికేషన్ స్కిల్స్, హెచ్‌ఆర్ రౌండ్‌కి ఎంపికయ్యారు. వీరిలో 9 మంది విద్యార్థులు వివిధ ఉద్యో గాలకు అర్హత సాధించారని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ వై.శ్రీధర్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది

ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కార్మికుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టేసే ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రొద్దుటూరు కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర, జిల్లా కమిటీ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఐదు రోజుల సమ్మె సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో సరిగా నమోదు కాకపోతే గైర్హాజరీ వేసి జీతంలో కోత విధిస్తారన్నారు. పనిదొంగగా చిత్రీకరించి శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏకపక్ష నిర్ణయాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అమలు చేయకుండా అడ్డుకోవాలన్నారు. ఐక్యంగా పోరాడాలన్నారు.


కరపత్రాలతో కార్మిక సంఘం నాయకులు

రక్తదానం అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రక్తదానం అభినందనీయమని పట్టణ సిఐ రాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హోంగార్డులు విధినిర్వహణలో నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి శిక్షణనిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలను కాపాడడమే కాకుండా సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమం పట్టణ ఎస్ఐలు హుస్సేన్ బాషా, చిరంజీవి, ఎఆర్ ఎఎస్ఐ ఎస్ఎం బాషా, రక్తనిధి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సిఐ రాజు


నిర్ణయించిన ధరలకే విక్రయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎరువులు, యూరియా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు విక్రయించాలని పులివెందుల ఎడిఎ అశోక్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఎడిఎ, ఎఒ వెంకట కృష్ణారెడ్డితో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్ స్టాక్, లైసెన్స్, ఫామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి నగదు బిల్లులు ఇవ్వాలన్నారు. బిల్లులు లేకుండా ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిజిస్టర్లు ప్రతి రోజు అప్డేట్ చేయాలని సూచించారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


ఎముకలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం కడప విద్యాసాగర్ హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, శ్రీలక్ష్మీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కీళ్ల మార్పిడి, విరిగిన ఎముకలపై అవగాహన కల్పించారు. పరీక్షలు నిర్వహించి కొంత మందికి శస్త్రచికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డిఇఒ నాగమునిరెడ్డి, మాజీ ఎంపిపి డి.గురివిరెడ్డి, జిల్లా రైతు సలహా మండలి సభ్యులు కర్నాటి నారాయణరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహర్ మున్నీర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.